ప్రజాశక్తి

శనివారం 6 సెప్టెంబర్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

తురకపాలెంలో
ఆరోగ్య అత్యవసర పరిస్థితి



తురకపాలెంలో పరిస్థితిపై అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

- మరణాలపై లోతుగా అధ్యయనం
- నేడు, రేపు ప్రత్యేక వైద్య బృందాలు రాక
- ఎయిమ్స్‌తో పాటు అంతర్జాతీయ వైద్యుల సాయం
- అనుమానితులకు 42 రకాల పరీక్షలు
- సోమవారం కల్లా తుది నివేదికివ్వాలని సిఎం ఆదేశం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో వరుస మరణాలపై మరింత లోతుగా పరిశోధన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. శని, ఆది వారాల్లో అన్ని రకాల వైద్య పరీక్షలు జరిపించాలని, సోమవారం కల్లా ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ సిద్ధం కావాలని జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులను సిఎం చంద్రబాబు శుక్రవారం ఆదేశించారు. కొత్త కేసులు నమోదు కాకూడదదని, అందరిలో నమ్మకాన్ని పెంచాలని సిఎం తన క్యాంపు కార్యాలయంలో వైద్యారోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన అత్యవసర సమీక్షలో ఆదేశించారు. రెండు నెలలుగా గ్రామంలో అంతుచిక్కని వ్యాధితో సంభవిస్తున్న వరుస మరణాలపైనా, ఆ గ్రామంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపైనా ఆయన చర్చించారు. ముందుగా అనుమానిత లక్షణాలపై అధ్యయనం చేయాలన్నారు. ఈ నేపథ్యంలో శని, ఆది వారాలు ప్రత్యేక వైద్య బందాలు తురకపాలెం రానున్నాయి. గ్రామంలోని అందరికీ నిర్దేశిత 42 వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. సోమవారం సాయంత్రం కల్లా వ్యాధి నిర్ధారణ నివేదికలు ప్రభుత్వంకు అందేలా ప్రణాళిక రూపొందిస్తారు.

తురకపాలంలో పరిస్థితులపై హెల్త్ ఎమర్జెన్సీగా పరిగణించాలనే సిఎం ఆదేశాలతో వైద్యారోగ్య శాఖాధికారులంతా ఉరుకులు పరుగులు పెడుతున్నారు. రాష్ట్ర అధికారులతో పాటు ఎయిమ్స్‌కు చెందిన సీనియర్ వైద్యుల బృందమూ తురకపాలెం రానుంది. అవసరం అయితే అంతర్జాతీయ వైద్యుల సాయం కూడా తీసుకోవాలని సిఎం సూచించడంతో అధికారులు వివిధ రంగాలకు చెందిన నిపుణులతో

▶ 2లో



గుంటూరులో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

గురువులు సమాజ నిర్దేశకులు

ఉపాధ్యాయ దినోత్సవంలో వక్తలు - గుంటూరులో 54 మంది, పల్నాడులో 104 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి-గుంటూరు

విద్యార్థులను అత్యున్నత స్థానాలను అధిరోహించేలా తీర్చదిద్దగల మహోన్నతమైన వారు విద్యనేర్పించే గురువులని జెడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో శుక్రవారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ్సంలో హెనీ క్రిస్టినా, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, నగర కమిషనర్ పి.శ్రీనివాసులు, ఎమ్మెల్యే గళ్లా మాధవి, రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ చెర్మన్ మన్నవ మోహన కృష్ణ, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయరు సజీలా, డిఇఒ రేణుక తదితరులు పాల్గొన్నారు. ముందుగా మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా, ఉప రాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా

▶ 2లో



నరసరావుపేటలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంపి శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ తదితరులు

సుగాలి ప్రీతి విషయంలో సంస్కారహీనంగా జనసేన వ్యాఖ్యలు : కెవిపిఎస్

ప్రజాశక్తి-గుంటూరు

సుగాలి ప్రీతి అంశాన్ని పరిష్కరించకుండా, ఆమె తల్లిపై ఆవాకుల చవాకులు పేలడం మానుకోవాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) గుంటూరు జిల్లా కమిటీ పేర్కొంది. ఈ మేరకు జిల్లా కార్యదర్శి జె.నవీన్‌ప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటన జారీ చేశారు. జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు అధికారదర్పం, సంస్కారహీనతకు నిదర్శనమని విమర్శించారు. బిడ్డను కోల్పోయి ఆవేదనలో ఉన్న తల్లితో కనీస మానవత్వంతో మాట్లాడాల్సింది పోయి, అవమానకరంగా ప్రవర్తించడం ఆ పార్టీ అసలు స్వరూపాన్ని బహిర్గతం చేస్తోందని పేర్కొన్నారు. 2017లో సుగాలి ప్రీతి మతిచెందినప్పుడు అప్పటి అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం ప్రీతి తల్లి వెల్లడించిన అనుమానాలను నిర్లక్ష్యం చేసి తాత్సారం చేసిందని, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం కూడా అదే వైఖరిని అనుసరించిందని, ఆ సమయంలో జనసేన ఈ అంశాన్ని ఓటు బ్యాంకు కోసం వాడుకుందని గుర్తు చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఆ కేసును తారుమారు చేసే శక్తులకు పవన్ కళ్యాణ్ మౌనం ద్వారా సహకరిస్తున్నారా...? అని ప్రశ్నించారు. కులాంతర వివాహం చేసుకున్న ఒక అగ్రవర్ణ మహిళ గిరిజన

▶ 2లో

మందులు , వైద్య పరికరాలపై జిఎస్టీని ఎత్తివేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలకు ఇప్పటికే వైద్యం భారమైన నేపథ్యంలో అన్ని రకాల మందులు, వైద్య పరికరాలపై జిఎస్‌టిని పూర్తిగా రద్దు చేసి, ప్రజలపై భారాలు తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.వెంకట్రావు డిమాండ్ చేశారు. శుక్రవారం బ్రాడీపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మందులు, వైద్య పరికరాలపై జిఎస్‌టి రద్దు చేయాలని తమ యూనియన్ అనేక సంవత్సరాలుగా పోరాడుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రెండ్రోజుల క్రితం ప్రవేశపెట్టిన జిఎస్టీ 2.0కి సంబంధించి 37 అత్యవసర మందులపై జిఎస్టిని రద్దు చేయటం ఆహ్వానిస్తున్నామని, అన్ని రకాల మందులపై జిఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఫార్మస్యూటికల్ యాజమాన్యాలకు మందుల ధరలను ఇష్టం వచ్చినట్టు పెంచుకునే అవకాశం కల్పించడం వల్ల యాజమాన్యాలు ఏడాదిలో రెండు సార్లు ఎంఆర్‌పిని పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతున్నారని చెప్పారు. మందుల ధరలను కేంద్ర ప్రభుత్వం నియంత్రించాలన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.కుమార్ మాట్లాడుతూ జిఎస్‌టికి వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఎనిమిదేళ్లుగా పోరాటం చేస్తోందని, 5 సార్లు దేశవ్యాప్త సమ్మె చేశామని, 4 సార్లు డిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించామని వివరించారు. ప్రజల సమస్యలపై పోరాటం చేయడంలో దేశవ్యాప్తంగా తమ యూనియన్ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ అబ్దుల్ సలీం, సిహెచ్ ఫణీంద్ర, జి.శ్రీనివాసరావు, జిల్లా సెక్రెటరీ ఎస్.మల్లికార్జునరావు, జాయింట్ సెక్రటరీలు జి.అనిల్ కుమార్, ఎస్.కష్ణప్రసాద్ పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న సి.వెంకట్రావు, ఇతర నాయకులు

ఎరువులు అక్రమంగా తరలకుండా నిఘా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : పల్నాడు జిల్లా పొందుగల వద్ద గల అంతర రాష్ట్ర సరిహద్దు ప్రాంతాన్ని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు గురువారం రాత్రి తనిఖీ చేశారు. యూరియా అక్రమంగా తరలకుండా అరికట్టేందుకు పోలీసు, వ్యవసాయ, రెవెన్యూ, మార్కెటింగ్ శాఖల సిబ్బందితో తనిఖీ బృందాన్ని నియమించామన్నారు. తెలంగాణకు తరలకుండా సరిహద్దు ప్రాంతాలైన పొందుగల, తంగేడ, నాగార్జున సాగర్ చెక్‌పోస్ట్‌ల వద్ద వాహన తనిఖీలను ముమ్మరం చేశామని తెలిపారు. ఎరువుల అంశంలో అక్రమాలకు పాల్పడితే ఎకా చట్టం (నిత్యావసరాల చట్టం), ఇతర రాష్ట్రాలకు ఎరువుల తరలింపు నియంత్రణ యాక్ట్ 1973, ఎరువుల నియంత్రణ యాక్ట్ 1985 ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. యూరియా అక్రమార్కుల గురించి తెలిస్తే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. యూరియా కొరతపై అసత్య వార్తలు ప్రచారం చేయొద్దన్నారు. తెలంగాణలోని నల్గొండ జిల్లాకు చెందిన పులి పిచ్చయ్య, భూక్య రవి ఈనెల 2న 630 కేజీల యూరియాను తరలిస్తుండగా పట్టుకున్నామని, వారిప్పుడు జైలులో ఉన్నారని చెప్పారు.

సుగాలి ప్రీతి విషయంలో సంస్కారహీనంగా జనసేన వ్యాఖ్యలు : కెవిపిఎస్

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబాలను మా కుటుంబాలు అని సంబోధించడం తప్పా...? అని ప్రశ్నించారు. ఆమె అంగవైకల్యాన్ని హేళన చేయడం తగదన్నారు. అమాయక జనసైనికులను రెచ్చగొట్టి, ప్రీతి తల్లిపై దాడులు చేయించడం సైకో ఆనందం పొందుతున్నారని విమర్శించారు. అప్పట్లో సుగాలి ప్రీతి విషయం ప్రపంచానికి తెలియచేశారు కాబట్టి, ఇప్పుడు అధికారం చేపట్టిన ఏడాదిన్నర తర్వాత కూడా న్యాయం జరగకపోతే అడగటం తప్పా.. అని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను, సుగాలి ప్రీతి కేసును ఎన్నికల అస్త్రాలుగా వాడుకున్న పవన్ కల్యాణ్, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో మోడీ కోసం మౌనం వహించాడని, ఎవరి మెప్పు కోసం సుగాలి ప్రీతి కేసును నీరుగార్చే చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని నిలదీశారు. పవన్ కళ్యాణ్‌కు చిత్తశుద్ధి ఉంటే, సుగాలి ప్రీతి విషయంలో సాక్ష్యాలు తారుమారు చేసిన వారిని కఠినంగా శిక్షించి, నిజమైన నేరస్తులను చట్టం ముందు నిలబెట్టాలని డిమాండ్ చేశారు.



నాలుగు నెలలుగా పిఎఫ్, ఇఎస్ఐ పెండింగ్


ప్రజాశక్తి - తుళ్లూరు

అసెంబ్లీ, సచివాలయ పారిశుధ్య కార్మికుల పెండింగ్ ఇఎస్ఐ, పిఎఫ్ వెంటనే చెల్లించాలని సిఐటియు గుంటూరు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికుల విస్తృత సమావేశం శ్రీలత అధ్యక్షతన మల్కాపురంలో గురువారం జరిగింది. లక్ష్మణరావు సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీ, సచివాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలలుగా పిఎఫ్, ఇఎస్ఐ చెల్లించడంలేదని, ఇప్పటికైనా కాంట్రాక్టర్ స్పందించి వెంటనే చెల్లించకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు మాట్లాడుతూ కాంట్రాక్టర్ మారినప్పుడల్లా జీతాలు, పిఎఫ్, ఇఎస్ఐలు నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నారని, పెండింగ్ జీతాలు సాధించుకోవడం కోసం పలుమార్లు ఆందోళన చేయాల్సి వస్తోందని అన్నారు. కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దుచేసి కార్మికులను ఆప్కాస్‌లో తీసుకొని ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతినెలా 5వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని కోరారు.

రూ.77,777 పలికిన గణేష్ లడ్డు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని గుండిమెడలో కొమ్మారెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో వినాయకుని విగ్రహాన్ని ఏర్పాటు చేయగా 9రోజుల తర్వాత శుక్రవారం గుండిమెడలో ఊరేగించారు. అనంతరం నిర్వహించిన లడ్డూ వేలంలో 5 కేజీల లడ్డూను కొమ్మారెడ్డి వెంకటేశ్వరరావు బుజ్జి రూ.77 వేల 777కు దక్కించుకున్నారు. కొమ్మారెడ్డి కిరణ్ మాట్లాడుతూ విగ్రహ మండప నిర్వహణకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర పద్మశాలి డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, స్వచ్ఛ ఆంధ్ర డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, టిడిపి గుండిమెడ గ్రామ అధ్యక్షులు గురుపాటి సుబ్బారావు, తెలుగురైతు గుంటూరు జిల్లా అధ్యక్షులు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, పెనుమాక పిఎసి చైర్మన్ కళ్లం శివగోవిందరెడ్డి, ఇప్పటం పిఎసి చైర్మన్ పోకల బాపయ్య, కాట్రగడ్డ మధుసూదన్‌రావు, సీనియర్ న్యాయవాది సుధాకర్‌రెడ్డి, వడ్డేశ్వరం ప్రసాదరావు, బిజెపి నాయకులు మేకల లక్ష్మణ్, కొల్లి సురేష్, నల్లి బోయిన శ్రీనివాసరావు, కాసారగడ్డ శ్రీనివాసరావు, అనుమోలు వీరాంజనేయ ప్రసాద్, సుబ్రహ్మణ్యం, మొక్కపాటి యేసు, ప్రసాద్, పాడిబండ్ల నాగేశ్వరరావు, కాసారనేని అంకినేయుడు, అనుమోలు సాంబశివరావు పాల్గొన్నారు.



తురకపాలెంలో ఆరోగ్య అత్యవసర పరిస్థితి

(మొదటి పేజీ తరువాయి)

చర్చిస్తున్నారు. గాలి, నీరు, ఆహారం, భూమి ద్వారా బ్యాక్టీరియా వ్యాపించే అవకాశాల దృష్ట్యా వివిధ రూపాల్లో పరీక్షలకు నిర్ణయించారు. ఇప్పటి వరకు ఉన్న జ్వరపీడితులతో అప్రమత్తంగా వ్యవహరించాలని, వారి నుంచి అన్ని స్థాయిలో రక్తనమూనాలు సేకరించాలని, సురక్షిత నీరు అందించాలని నిర్ణయించారు. జ్వరంతో బాధపడుతున్నవారి విషయంలో మరింత జాగ్రత్తగా ఉండండి.' అని సిఎం సూచించారు. తురకపాలెంలో ప్రస్తుతం ఉన్న కేసులను పరిశీలిస్తే 'మెలియోయిడోసిస్' లక్షణాలు ఉన్నట్టు వైద్యాధికారులు అనుమానం వ్యక్తం చేశారు. ల్యాబులకు పంపిన రక్త నమూనాల ఫలితాలు 72 గంటల్లో వస్తాయని సిఎంకు అధికారులు తెలిపారు. పశుపోషణ పైనా ఎక్కువ మంది ఆధారపడటంతో పశువుల నుంచి ఏమైనా బ్యాక్టీరియా వ్యాప్తి చెందవచ్చనే కోణంలోనూ పరిశీలిస్తున్నారు.

డయాబెటిస్, హైపర్ టెన్షన్, కార్డియాక్, బ్రెయిన్ స్ట్రోక్ వంటి వ్యాధులు ఎక్కువగా ఉన్నాయని, మద్యం వినియోగం అధికంగా ఉందని, స్టోన్ క్రషర్లు ఆ ప్రాంతంలో ఎక్కువగా ఉండటంతో వాతావరణ నాణ్యతను కూడా తనిఖీ చేస్తున్నామని వివరించారు. మొదట జ్వరం, దగ్గు, తర్వాత ఊపిరితిత్తులు దెబ్బతినడం వంటి లక్షణాలు ఎక్కువ మందిలో సాధారణంగా కనిపిస్తున్నాయని అధికారులు చెప్పారు. యాంటిబయాటిక్స్ ఆరు వారాలు నిరంతరాయంగా వాడటం వల్ల వ్యాధి నియంత్రణలోకి వస్తోందని చెప్పారు. దీనిపైన మరింత లోతుగా అధ్యయనం చేస్తున్నామన్నారు. మైక్రోబయాలజీ డిపార్ట్‌మెంట్ కూడా పరిశోధన చేస్తోందని జిల్లా కలెక్టరు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సిఎంకు వివరించారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయలక్ష్మి, సూపరింటెండెంట్ ఎస్ఎస్.వి. రమణ, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ సుందరాచారి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు. మెలియోయిడోసిస్ ప్రధానంగా భూమిలోనూ, నిల్వ నీరులో, తడి నేలలో ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా వర్షాకాలంలో, వరదల సమయంలో వ్యాప్తి చెందుతుంది. డయాబెటిస్, కిడ్నీ, లివర్ సమస్యలు ఉన్నవారు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, రైతులు, నీటిలో ఎక్కువగా పనిచేసేవారు ఈ వ్యాధికి గురయ్యే అవకాశం ఉంటుందని వైద్యులు చెప్పారు. మట్టిలో, నీటిలో ఉన్న బ్యాక్టీరియా గాయాలు లేదా చర్మ పగుళ్ల ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తుందన్నారు. కాలుష్యమైన నీరు తాగినా, ఒక్కోసారి శ్వాస ద్వారా కూడా సంక్రమించవచ్చని చెప్పారు.

గురువులు సమాజ నిర్దేశకులు

(మొదటి పేజీ తరువాయి)

దేశానికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఎనలేని సేవలు అందించారని, ఉపాధ్యాయులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో విద్యాప్రమాణాల మెరుగుదలకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పూర్తి స్థాయిలో మౌలిక సౌకర్యాల కల్పనతో పాటు, డిజిటల్ బోర్డులపై నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అత్యధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, నాణ్యత ప్రమాణాలతో విద్యా బోధన జరుగుతోందన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థల్లోను మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సమాజానికి ఉన్నతమైన వ్యక్తులను అందించేలా ఉపాధ్యాయులు తరగతిగదులలోనే పునాదులు వేసేలా విద్యాబోధన చేయాలన్నారు. మాధవి మాట్లాడుతూ. నేటి అధునిక యుగంలో సక్సెస్ అనే పరుగులో విద్యార్థులతో పాటు గురువులు ఒత్తిడికి గురవుతున్నారని, సమాజంలో స్థితిగతులను మార్చే అంశాల్లో ఉపాధ్యాయుల సూచనల అమలుకు తన వంతు సహకారం అందిస్తామని చెప్పా అనంతరం 9 మంది ప్రధానోపాధ్యాయులు, 20 మంది స్కూల్ అసిస్టెంట్లు, 25 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు మొత్తం ఎంపిక చేసిన 54 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓలు శాంతకుమారి, ఏసురత్నం, ఎంఈఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా ముందుగా కలెక్టర్ అనుమతి పొందిన ఉత్తమ ఉపాధ్యాయ జాబితాకు తోడు మరో ఇద్దరు ఉపాధ్యాయుల పేర్లు అప్పటికప్పుడు ప్రకటించటం సభలో చర్చనీయాంశమైంది. ముందుగా ఉపాధ్యాయుల నుండి దరఖాస్తులు స్వీకరించి, పలు దశల్లో వాటిని పరిశీలించి, మొత్తం 54 మందికి అవార్డులు ప్రకటించారు. అయితే సభలో అప్పటికప్పుడు మరో ఇద్దరి పేర్లను జోడించారు. అయితే అధికారులు ఎన్నిసార్లు వారి పేర్లను పిలిచినా సభ పూర్తయ్యే వరకూ వేదిక వద్దకు రాకపోవటంతో వారికి అవార్డులు ఇవ్వలేదు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం భువనచంద్ర టౌన్‌హాల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్.పి కె.శ్రీనివాసరావు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 104 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుని పాత్ర చాలా కీలకమని, వారి సేవలను కొనియాడారు.

గుంటూరు డిఇఒ వైఖరి సరికాదు-ఫ్యాప్టో

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల పట్ల గుంటూరు డిఇఒ వైఖరి సరికాదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య జిల్లా ఛైర్మన్ కె.నరసింహారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలకు కనీసం సమాచారం ఇవ్వకపోవటం ఉపాధ్యాయ సంఘాలను అవమానించడమే అవుతుందని పేర్కొన్నారు. గతంలో జిల్లాలో పనిచేసిన విద్యాశాఖ అధికారులెవ్వరూ ఈవిధంగా చేయలేదని, అనేక సందర్భాల్లో ఉపాధ్యాయ సంఘాలతో కో-ఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేసేవారని గుర్తు చేశారు. అయితే అందుకు భిన్నంగా ప్రస్తుత జిల్లా విద్యాశాఖ అధికారి వారి చుట్టూ ఒక కోటరీ ఏర్పాటు చేసుకొని, ఉపాధ్యాయ సంఘాలతో కనీసం ఏ విషయంలో సంప్రదించకుండా ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. డిఈవో తమ వైఖరిని మార్చుకోవాలన్నారు.

కార్మిక మహాప్రదర్శనకు తరలిరావాలి : సిఐటియు



ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సిఐటియు 18వ అఖిల భారత మహాసభ డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు విశాఖలో జరుగుతుందని, ఈ సందర్భంగా 4న నిర్వహించే కార్మిక మహాప్రదర్శనకు రాజధాని ప్రాంతం నుండి కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి కోరారు. ఎర్రబాలెం, నవులూరు, బేతపూడి, నిడమర్రు మున్సిపల్ కార్మికుల విస్తృత సమావేశం ఎర్రబాలెంలో శుక్రవారం నిర్వహించారు. ఎం.రవి మాట్లాడుతూ కార్మికులను కట్టుబానిసలుగా మార్చే విధానాలను కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అవలంబిస్తోందని, లేబర్ కోడ్లు అందులో భాగమని అన్నారు. ఈ క్రమంలో కార్మిక హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా కార్మిక వర్గం పోరాడుతోందని చెప్పారు. మున్సిపల్ కార్మికులు గతంలో 17 రోజుల సమ్మె చేసిన సందర్భంగా ప్రభుత్వం అంగీకరించిన ఒప్పందాలను జీవోలు విడుదల చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు 12వ పిఆర్‌సిని అమలు చేయాలని, వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచాలని, గ్రాట్యూటీ ఇవ్వాలని, జీవో 26 ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలైన కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు. ఈ అంశాలపై దశలవారీ ఆందోళనలు చేస్తామని చెప్పారు. ఎమ్‌టిఎంసి పరిధిలో ఇటీవల కొంతమంది పారిశుధ్య కార్మికులను 60 ఏళ్లు నిండాయనే పేరుతో పని నుండి నిలిపేశారని, వారి స్థానంలో వారి కుటుంబీకులను తీసుకోవాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాజధాని ప్రాంత నాయకులు టి.బాబు, ఒ.రామారావు, టి.ఆదిలక్ష్మి, శివనాగేంద్రం, కనకమ్మ, రజిని, కె.కోటేశ్వరి, ఎన్.దివ్య, ఎం.పార్వతి, పాండు, ఏడుకొండలు, అంకమ్మరావు, సుభాని, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



రూ.4.7 కోట్లతో వాటర్ ట్యాంక్ నిర్మాణం

ప్రజాశక్తి - దుగ్గిరాల : రక్షిత తాగునీటి సరఫరా కోసం జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా మండల కేంద్రమైన దుగ్గిరాలలో వాటర్ ట్యాంక్‌కు ఎంపీపీ షేక్ జబీన్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. యార్డ్ చైర్మన్ ఉన్నం ఝాన్సీ మాట్లాడుతూ స్వచ్ఛమైన నీరు ప్రజల ఆయుష్ ఆరోగ్యాలు పెంచడంలో సహాయపడుతుందన్నారు. సర్పంచ్ బాణావత్ ఖుషిభాయ్ మాట్లాడుతూ నిర్మాణానికి మంత్రి నారా లోకేష్ సహకారం అందిస్తున్నారని చెప్పారు. గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దటంలో మంత్రి తోడ్పాటు ఎనలేనిదన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ ఎ.రామకృష్ణ మాట్లాడుతూ నిర్మాణం, పైప్ లైనింగ్‌ను ఏడాదిలో పూర్తి చేసి గ్రామంలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గూడూరు వెంకటరావు, కేశంనేని శ్రీఅనిత, గద్దె శ్రీనివాస్, మిక్కిలినేని గాంధీ, పర్వతనేని హర్ష, వల్లూరు నరసింహారావు, నక్క చిరంజీవి, బాణావత్ వెంకటేశ్వర నాయక్, కొంగర జోగేంద్ర ప్రసాద్, పసుపులేటి శ్రీనివాసరావు, కె.వివేకానంద, ఏఈ వేణుగోపాల్ కాంట్రాక్టర్ కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంగీత, నాటక అకాడమీ డైరెక్టర్ మాగంటి శాస్త్రికి సన్మానం

ప్రజాశక్తి - తెనాలి

రాష్ట్ర సంగీత నాటక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన బ్రాహ్మణ సేవా సమితి ప్రధాన కార్యదర్శి మాగంటి వెంకట సుబ్రహ్మణ్య రత్నాకర శాస్త్రిని పట్టణానికి చెందిన బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. రామలింగేశ్వరపేటలోని సమితి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షులు కొమ్మమూరి కాశీ శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ కళల కాణాచి తెనాలి వ్యక్తికి అరుదైన గౌరవం లభించిందన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పురస్కరించుకొని ప్రముఖ హిందీ ఉపాధ్యాయిని కరవది సరస్వతిని సేవా సమితి ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో గుమ్మడి రవీంద్రబాబు, పెద్దిరాజు సత్యనారాయణ, పి పురుషోత్తమ శర్మ, త్రిపురారిభట్ల దత్తు, సిహెచ్ శ్రీనివాస్, వి.మణి కిషోర్, టి.రాజాఫణింద్ర, ఎ.మాధవశాస్త్రి, డి.శ్యాం సుందర్ శర్మ, ఎల్.లక్ష్మణరావు, కె.కీర్తి, ఎం.ఆదిశేషగిరిరావు పాల్గొన్నారు.

ముగిసిన మహా గణపతి నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - పెదకాకాని : స్థానిక మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన గణపతి మహోత్సవాలు శుక్రవారం జరిగాయి. గ్రామోత్సవాన్ని దేవస్థాన ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ ప్రారంభించారు. విగ్రహాన్ని గొల్లమూడి కాల్వలో నిమజ్జనం చేశారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తెనాలి

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జి. వెంకటాద్రి తెలిపిన వివరాల ప్రకారం తెనాలి విజయవాడ రైలు మార్గంలో కొలకలూరు రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు ఘటనాస్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. సుమారు 50 ఏళ్ల వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్టు గుర్తించారు. మృతుడు లేత ఆకుపచ్చ రంగు, తెలుపు మీద ఎరుపు, నలుపు గళ్లు కలిగిన చొక్కా ధరించి ఉన్నాడని, మృతదేహం వద్ద టర్కీ టవల్ ఉండడంతో రైతు అయి ఉంటాడని భావిస్తున్నారు. ఛిద్రమైన శరీరభాగాలను తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు 7207076614 నంబరులో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

హైటెక్ చోరాగ్రేసుడు అరెస్టు

ల్యాప్ టాప్‌లు, బంగారం స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పార్కింగ్ చేసిన కార్ల అద్దాలు రెప్పపాటులో పగలగొట్టి, ల్యాప్ ట్యాప్‌లు, నగదు, బంగారం దోచుకెళ్లిన హైటెక్ దొంగను నల్లపాడు పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హైటెక్ దొంగతనాలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్, రూ.6 ల్యాప్ ట్యాప్, 11 గ్రాముల బంగారం, రూ.2 లక్షల నగదు రికవరీ చేశా మన్నారు. గతంలో హత్యకేసులో నిందితుడుగా ఉన్న నాదెండ్ల మండలం గొరిజవోలు గ్రామానికి చెందిన జంగం బాజీ అలియాస్ ముక్కంటి వ్యసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడు తున్నారని ఎస్‌పి తెలిపారు. యూట్యూబ్ ద్వారా కార్ల అద్దాలు ఎలా పగలగొట్టాలో తెలుసుకుని, దొంగతనాలు చేయడంలో ఆరితేరాడని ఆయన తెలిపారు. రెప్పపాటులో అద్దాలు పగల గొట్టి, కార్లలోని విలువైన వస్తువులు దోచుకెళ్లడంలో అందెవేసిన చేయిగా ఉందన్నారు. సిసిటివిలు, సాంకేతిక ఆధారాలతో దొంగను అరెస్ట్ చేశామన్నారు. బాజీపై మొత్తం 10 కేసులు ఉన్నాయన్నారు. లాప్టాప్, నగదు, బంగారం దొంగిలించినట్లు విచారణలో వెల్లడయి నట్టు తెలిపారు. నల్లపాడులో 4 కేసులు, నగరంపాలెంలో 3 కేసులు, పెదకాకాని 1, పాత గుంటూరులో ఒకటి, అరండల్‌పేటలో మరొక కేసు ఇతనిపై ఉన్నాయన్నారు. నరసరావుపేట ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన హత్య కేసులో నిందితుడుగా ఉన్నారన్నారు. డిఎస్‌పి బానోదయ, సిఐలు వంశీధర్, అనురాధ, ఎస్ఐ చల్లా వాసు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న ల్యాప్‌ట్యాబ్‌లు పరిశీలిస్తున్న ఎస్‌పి

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మేడికొండూరు



పురుగుమందు సేవించి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి చికిత్స పనులు మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. మండ లంలోని విశదల గ్రామానికి చెందిన మేడికొండూరు శ్రీనివాస (47) చక్రవర్తి పౌరోహిత్యం చేస్తుంటాడు. వ్యక్తిగత కారణాల రీత్య వివాహం కాకపోవడంతో మనస్థాపానికి గురై గురువా రం పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గమనించి గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తర లించి వైద్య చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్ర వారం చక్రవర్తి మృతి చెందాడు. సంఘటనపై మేడి కొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల అదుపులోకి గంజాయి ముఠా

ప్రజాశక్తి - పెదకాకాని

జిల్లాలో గంజాయి ముఠా విజృంభించడంతో ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు పెదకాకాని పోలీసులు తమ నిఘాను విస్తృతం చేశారు. పెదకాకాని పెట్రోల్ బంక్ వెనక గంజాయి కార్యకలాపాలకు పాల్పడుతున్నారని సమా చారం అందడంతో నిఘా పెట్టిన పోలీసులు శుక్రవారం ఉదయం ఆరుగురిని అదుపులోని తీసుకొని వారి నుండి సుమారు రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని విచారిస్తున్నారు. వీరిలో ఒకరు హైదరాబాదుకు సంబంధించిన యువకుడు కాగా మిగిలినవారు పెదకాకానికి చెందిన యువకులుగా గుర్తించారు. వారి పేర్లు మేకతోటి తేజస్విన్ అలియాస్ మట్టు, పెదకాకానికి చెందిన నవదీప్, పల్లె జాన్సన్, పాలేపోగు చిన్ని, యోగి సూరిబాబు, యాసారపు దీపకులుగా గుర్తించారు.

నంది పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



ఉపాధ్యాయులను సన్మానించిన పాఠశాల యాజమాన్యం

ప్రజాశక్తి-పెదనందిపాడు

డాక్టర్ సర్వేపల్లి రాధాకఅష్ణన్ జయంతి సందర్భంగా మండలంలోని నంది పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధులుగా పాఠశాల ప్రెసిడెంట్ కాళహస్తి సత్యనారాయణ (రిటైర్డ్ ఎఎస్పి) పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపాధ్యాయులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, అతిధులు పూలు వేసి, నమస్సుమాంజలి ఘటించారు. కార్యక్రమానికి సభాధ్యక్షులుగా వ్యవహరించిన కాళహస్తి సత్యనారాయణ మాట్లాడుతు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజునే ఉపాధ్యాయ దినోత్సవ జరపడానికి గల కారణాన్ని విద్యార్థులకు, టీచర్లకు తెలియజేశారు. అతిథులుగా విచ్చేసిన గుంటూరు విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. అనురాధ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి గొప్పదని, నేను కూడా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నాను కాబట్టి వారి కష్టాలు, బాధ్యతలు బాగా తెలుసు అన్నారు. నంది స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు పోపూరి రామాంజనేయులు మాట్లాడుతూ సాధారణ విద్యార్థి నుండి దేశాన్ని నడిపించే సారథుల వరకు తయారు చేయగల సామర్థ్యం ఒక్క టీచర్లకు మాత్రమే ఉందన్నారు. కాలేజ్ ప్రిన్సిపల్ డా.జి వీర రాఘవయ్య , ఉపాధ్యాయులు నల్లూరి సత్యనారాయణ , ధనలక్ష్మి , అమరేశ్వరి, ఐ. సీతారామ్ తదితరులు పాల్గన్నారు. పాఠశాల సెక్రెటరీ కరస్పాండెంట్ డాక్టర్ లావు రత్తయ్య , పాలకవర్గ సభ్యులు, కమిటీ మెంబర్లు నందిపాఠశాల ఉపాధ్యాయులకు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని బొగ్గరం గ్రామానికి చెందిన సిద్ధి వీరాంజనేయులు ఇంటిపై ఉన్న వేప కొమ్మను కొట్టే క్రమంలో 11 కె.వి విద్యుత్ తీగ తెగి మీద పడడంతో తీవ్ర గాయాలు కాగా నరసరావుపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్ర వారం తెల్లవారుజామున మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతునికి భార్య హైమావతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



సిద్ధి వీరాంజ నేయులు (ఫైల్ ఫొటో)

ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - మేడికొండూరు

రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘ టనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని సత్తనపల్లి రోడ్డు లో భీమినేని వారి పాలెం సిరిపురం అడ్డ రోడ్డు వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. క్రోసూరు మండలం ఆవుల వారి పాలెం గ్రామానికి చెందిన పుల్లగూర అభి గుంటూరు వైపు వెళుతున్నాడు. అదే క్రమంలో ఎదురుగా వస్తున్న కారు అదుపుతప్పి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. గాయపడిన అభిని స్థానికులు 108 సాయంతో గుంటూరు ప్రభుత్వాసు పత్రికి తరలించారు.

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని కృష్ణనగర్,5 అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం నవజీవన్ ఆధ్వర్యంలో కిషోర్ బాలికలకు మినిస్ట్రీ ఐజాన్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ సైకియాట్రిస్ట్ అనూష మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, నెలసరి సమస్యలు, పోషకా హారం తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శివమణి, అంగన్వాడి ఉపాధ్యాయులు సుజాత, లీల, ప్రమీల, కిషోరబాలికలు పాల్గొన్నారు.



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న అనూష



బాధ్యతలు చేపడుతున్న గంధం సురేంద్ర

ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షునిగా గంధం సురేంద్ర

ప్రజాశక్తి - పొన్నూరు

పచ్చలతాడిపర్రు ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షునిగా గంధం సురేంద్ర ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అంగరంగ వైభవంగా పచ్చలతాడిపర్రు ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం జరిగింది. పలువురు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు

ప్రజాశక్తి - మేడికొండూరు

మహమ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా శుక్రవారం పేరేచర్లలో మిలాద్ ఉన్ నబి వేడుకలను నిర్వహించారు. పెద్ద మసీదు నుండి పేరేచర్ల సెంటర్ వరకు ఎల్ఎంఎస్ కాలనీ వీధుల్లో ర్యాలీ చేశారు.

గురువులకు ఘన సత్కారం



కన్నామంజూల దంపతులను సన్మానిస్తున్న ఎంపీ, కలెక్టర్



మాచర్లలో చంద్రయ్యను సన్మానిస్తున్న పెన్షనర్ల సభ్యులు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మండలంలోని బోల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు కన్నా మంజులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. నర్సారావుపేట భువనచంద్ర టౌన్ హాలులో అవార్డుల ప్రధానోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు,డిఇఓ చంద్రకళ,నర్సారావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీ కృష్ణదేవరాయలు, నర్సారావు పేట శాసనసభ్యులు చదలవాడ అరవిందబాబు ఆమెకు అవార్డు ప్రదానం చేశారు. కన్నా మంజులను, ఆమె భర్త ముప్పాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లెక్కల ఉపా ధ్యాయులు కొంజేటి సాయిజగన్నాథరావును దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కన్నా మంజుల మాట్లాడుతూ 21 సంవత్సరాల ఉపాధ్యాయ వృత్తిలో హిందీ విభాగంలో విద్యార్థులు నూటికి నూరుశాతం ఫలితాలు సాధించే విధంగా ప్రణాళికబద్ధంగా బోధించడమే కాకుండా క్రమశిక్షణతో కూడిన విద్యను అందించామన్నారు. ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందని ఆమె తెలిపారు.

ప్రజాశక్తి - వినుకొండ

డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవవేడుకలను శ్రీ విజేత కాన్సెప్ట్ స్కూల్‌లో నిర్వహించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి జ్యోతిప్రజ్వలన చేసి, పూలమాలలతో ఘన నివాళులర్పించారు. కరస్పాండెంట్, డైరెక్టర్లు మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడూ సర్వేపల్లిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు సత్ప్రవర్తనకు మారుపేరుగా నిలిచి సమాజాన్ని నడిపించే గురుతర బాధ్యతలు నిర్వర్తిస్తారన్నారు. వేడుకలలో పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణానికి చెందిన ప్రసిద్ధ కవి కరీముల్లాకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రభుత్వం అంద జేసింది. నర్సరావుపేటలో భువనచంద్ర టౌన్‌హాల్లో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో కలెక్టర్, డిఇఒ యల్.చంద్రకళ, జిల్లా పరిషత్ ఛైర్మన్ హెన్రీ క్రిస్టినా, యంపి లావు కృష్ణదేవ రాయలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో పెన్షనర్ల సంఘం సభ్యులు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి అందుగుల చంద్రయ్యని సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా, గంగలకుంట గ్రామ సర్పంచిగా, ప్రస్తుతం సంఘ ప్రధాన కార్యదర్శిగా, వివిధ సేవా సంస్థల ద్వారా అందుగుల చంద్రయ్య అందిస్తున్న సేవలను కొనియాడారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణారావు, గాలిబ్, గౌస్ మోహిద్దీన్, పాపిరెడ్డి, కోదండపాణి, కిరీటి రెడ్డి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాయపూడి సాంబశివరావును సత్కరించారు. నరసరావుపేటలోని భువనచంద్ర సమావేశాలులో డీఈవో చంద్రకళ, నరసరావుపేట శాసన సభ్యులు అరవింద్‌బాబు సమక్షంలో మెమెంటోతో దుశ్శాలువాతో సత్కరించారు. పెదకూరపాడులోని హెచ్ డబ్ల్యు పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడం. విభిన్న పద్ధతుల్లో బోధించడంతో అతనిని అవార్డుకు ఎంపిక చేశారు. తాళ్లూరు జేబి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు హిమని సత్కరించారు. వారిని ప్రజాకవి పిడిఎఫ్ కన్వీనర్ డి.శేషారావు, సహచర ఉపాధ్యాయులు ఎస్ సాంబశివరావు, జి అనిత, స్థానిక నేతలు అభినందించారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం జొన్నలగడ్డ గ్రామ పరిధిలో గల కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం టీచర్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ గొప్పదనాన్ని, చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య విద్యార్థులకు వివరించారు. అనంతరం, స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్చార్జ్ కోట బాపూజీ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు చలో విజయవాడ : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేడు చేపట్టనున్న చలో విజయవాడ కార్య క్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కన్వీ నర్ కె.సాయికుమార్ పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్ ఫీజు రీయింబర్సుమెంట్ బకాయిలు రూ .6400 కోట్లు వెంటనే విడుదల చేయాలని, జిఓ నెం. 77 రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్సుమెంట్ అందించాలనీ, సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు నెలకు రూ .3 వేలకు మెస్‌చార్జీలు పెంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. విద్యార్థులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ దశల వారీ పోరాటాలు చేస్తూనే ఉంటుందన్నారు. విద్యార్థుల సమస్యలపై ప్రశ్నించే గొంతులు నొక్కే విధంగా విద్యార్థి సంఘాలను విద్యాసంస్థల్లోకి నిషేధిస్తూ ఇచ్చిన జీఓ ఉపసంహరించుకోవాలన్నారు.



లక్ష్మిని సత్కరిస్తున్న కలెక్టర్, ఎంపి, ఎమ్మెల్యే, ఉపాధ్యాయులు

ప్రధానోపాధ్యాయినికి అవార్డు

ప్రజాశక్తి-ఈపూరు

గణిత ఉపాధ్యాయినిగా, కొండ్రముట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలపాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి కోసం శ్రమించిన ఎన్ సిహెచ్ బిజె లక్ష్మికి జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలు అవార్డు దక్కింది. గురుపూజోత్సవ పర్వదినాన్ని పురస్కరించుకొని పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట భువనచంద్ర టౌన్ హాలులో నిర్వహించిన జిల్లాస్థాయి అవార్డుల ప్రధానం కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్ బాబు, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, డీఈవో చంద్రకళ చేతుల మీదుగా లక్ష్మి ఘన సన్మానంతో పాటు అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మిని ఎంఈఓ - 1 జప్రుల్ల, ఎంఈఓ 2 రామ తులసి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.



ఎన్నిక అయిన నూతన కమిటీ సభ్యులు

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

భవన నిర్మాణ కార్మిక సంఘం

ప్రజాశక్తి - వినుకొండ

భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు పల్నాడు జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి సిలార్ సాహెబ్ కోరారు. పుతుంబాక వెంకటపతి భవన్లో శుక్రవారం పొప్పూరి వెంకటప్పయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిలార్ మాట్లాడుతూ జిల్లా మూడో మహాసభలు ఈనెల ఏడో తేదీన నరసరావుపేట కోటప్ప కొండ రోడ్డులోని పలనాడు విజ్ఞాన కేంద్రంలో నిర్వహిం చడం జరుగుతుందని వినుకొండ నియోజకవర్గంలోని భవన నిర్మాణ కార్మికులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రెబ్బ శంకర్, ప్రధాన కార్యదర్శిగా గంజి శ్రీను, ఉపాధ్యక్షులుగా గురువాచారి, మార్బల్ శ్రీను, మరో అయిదుగురు కమిటీ సభ్యులుగా ఎన్నిక అయినారు.

ఎపిఎన్‌జిఓ పల్నాడు జిల్లా అడహక్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గుంటూరు



నూతన కా ర్యవర్గ సభ్యుల ఎన్నిక సమావేశంలో మాట్లాడుతున్న విద్యాసాగర్

ఎపిఎన్‌జిఓ అసోసియేషన్ కొత్త జిల్లాల వారీగా నూతన అడహక్ కమిటీలను ఎన్నుకున్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌జిఓ కళ్యాణ మండపంలో జరిగిన నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అలపర్తి విద్యాసాగర్, డి.వి. రమణ పాల్గొన్నారు. సమావేశానికి గుంటూరు జిల్లా అధ్యక్షులు ఘంట సాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. విద్యాసాగర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగుల బకాయిలపై దృష్టి పెట్టి రూ.వేల కోట్లు చెల్లించిందని, ఉద్యోగులకు రావాల్సిన డిఎలు, పిఆర్సి ఇతరత్రా ప్రయోజనాలు తప్పనిసరిగా మంజూరు చేస్తుందని అన్నారు. సంఘ నాయకులు సభ్యుల ప్రయోజనాల కోసం కలిసి కట్టుగా కృషి చేయాలని కోరారు. తాలూకా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సభ్యుల సహకారంతో సంఘాన్ని పటిష్టం చేయాలన్నారు. డి.వి.రమణ మాట్లాడుతూ ఉద్యోగులు సంఘటితంగా ఉండి రాష్ట్ర సంఘానికి వెన్నుదన్నుగా నిలిచినప్పుడే తాము రావాల్సిన ప్రయోజనాలు సాధించుకోగలమన్నారు. జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శ్యాంసుందర్ మాట్లాడుతూ ఉద్యోగుల ప్రయోజనాలు సాధించడంలో శాయశక్తుల కృషి చేస్తామన్నారు. అనంతరం పల్నాడు జిల్లాకు అడహక్ కమిటీ చైర్మన్‌గా ఎం.రామకృష్ణ, కన్వీనర్‌గా కె.నాగేశ్వరరావు, ట్రెజరర్‌గా బ్రహ్మేశ్వరరావు సభ్యులుగా రామయ్య, అప్పారావు, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావును ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు జగదీష్, రంజిత్ నాయుడు, రామ్ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు ఎపిజిఎఫ్ మహిళ విభాగ కన్వీనర్ రాజ్యలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగూర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమెరికాలో జరిగే పారా సిట్టింగ్ వాలీబాల్ పోటీలకు ఎంపికైన జిజిహెచ్ స్టాఫ్ నర్స్ వి.విజయ్‌కుమార్‌కు విద్యాసాగర్ ద్వారా ఎన్‌జిఓ జిల్లా కమిటీ రూ.10 వేల చెక్కును అందజేశారు.

నబీ బాజీకి గిన్నీస్ బుక్ అవార్డు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బీమా రంగంలో ప్రఖ్యాత ఎల్ఐసిలో అత్యధిక పాలసీలు నమోదు చేయడంలో కీలకంగా వ్యవహరించిన నరసరావుపేట మండలం చిన్న తురకపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నబీ అబ్దుల్లా కుమారుడు షేక్. నబీ బాజీ గిన్నీస్ బుక్ అవార్డు అందుకున్నారు. గురువారం నరసరావుపేట ఎల్ఐసి బ్రాంచ్ సీనియర్ మేనేజర్ పి.శేషగిరిరావు, మచిలీపట్నం డివిజన్ క్లియా మేనేజర్ వరప్రసాద్ నబీబాజికి అవార్డు అందజేసి సత్కరించారు. సంస్థ అభివృద్ధికి నబీ బాజి అందిస్తున్న సేవలను కొనియాడారు. నబీ బాజి మాట్లాడుతూ గిన్నీస్ బుక్అవార్డు లభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ ఏడాది జనవరి 20న ఇతర బీమా కంపెనీలతో పోలిస్తే ఎల్ఐసి ఒక్క రోజులో 5,88,107 పాలసీలు చేయడం, అధిక మొత్తంలో పాలసీలు చేసిన కొందరిని గిన్నీస్ బుక్ అవార్డు అందజేసి సత్కరించడం జరిగిందన్నారు. బీమా రంగంలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి కతజ్ఞతలు తెలిపారు. నబీ బాజి ప్రస్తుతం ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (సిఐటియు)



నబీబాజిని సత్కరిస్తున్న మేనేజర్ శేషగిరిరావు



స్మార్టు రేషన్‌కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరు మండలంలోని పచ్చలతాడిపర్రు గ్రామంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ కార్యక్రమాన్ని పొన్నూరు నియోజకవర్గం శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్బన్ కార్పొరేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్ పొన్నూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త వడ్రణం మార్కొండెయులు బాబు ఆధ్వర్యంలో పొన్నూరు మండలంలోని పచ్చలతాడిపర్రు గ్రామంలో శుక్రవారం నూతనంగా విడుదలైనటువంటి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా దూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలపై బమ్మలు వేసుకునే సంస్కృతి కూటమి ప్రభుత్వానికి లేదని అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పథకాలు అందేలా చూడడమే తమ భాధ్యత అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో పొన్నూరు మండల పట్టణ కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ పురస్కారానికి కవి కమలారామ్ ఎంపిక

ప్రజాశక్తి - వినుకొండ

మదర్ తెరిస్సా సర్వీసు సొసైటీ సేవా సంస్థ మూడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 'డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్' జాతీయ అవార్డుకు వినుకొండకు చెందిన రచయిత జి.కమలారామ్‌ని ఎంపిక చేసినట్లు సంస్థ జాతీయ కార్యదర్శి డాక్టర్ మల్లాది ప్రసాద్‌రావు తెలిపారు. ఈనెల 15వ తేదీ విజయవాడలో జరిగే అవార్డుల ప్రధానోత్సవంలో అందజేస్తారని అన్నారు. పురస్కారానికి ఎంపిక జేసినందుకు మదర్ తెరిస్సా సేవా సంస్థ వారికి కమలారామ్ ధన్యవాదాలు తెలిపారు. కవిరత్న కమలారామ్‌ను పలువురు అభినందించారు.

చెరువు కట్ట మరమ్మతులు తక్షణమే చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెదకాకాని

మంచినీటి చెరువు కట్ట మరమ్మతులు తక్షణమే చేపట్టాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం శాఖ సమావేశం బి.బాబురావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పెదకాకాని మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ పెదకాకాని గ్రామంలో గత నెల 13వ తేదీన కురిసిన భారీ వర్షాలకు మంచినీటి చెరువునకు మరియు మురుగు నీరు చెరువు నకు మధ్యలో గల కట్ట తెగి నందున మంచినీటి చెరువులో మురుగునీరు చేరి నీరు మొత్తం కలుషితమై మంచినీరు తాగే వీలు లేకుండా పోయిందని, మంచినీటి చెరువులో ఉన్న మురుగు నీటిని తొలగించి చెరువును ఎండబెట్టి తరువాత మంచినీటి చెరువులో నీరు నింపాలని శివాజీ డిమాండ్ చేశారు. గతంలో చెరువు కట్ట పనులు నాసిరకంగా జరిగాయని, కాంట్రాక్టర్లు నామ మాత్రంగా పనిచేసి బిల్లులు చేసుకున్నారని, చెరువుకట్ట నాసిరకంగా ఉండటం వలన వర్షానికి కట్ట తెగి పోయిందని, గత రెండు నెలల నుండి గ్రామంలో మంచినీరు సరిగా రావడం లేదని, మురుగునీరు వస్తున్నందున గ్రామ ప్రజలు అనారోగ్యానికి బారిన పడి వ్యాధులు సోకుతాయని, పిల్లలకు చర్మవ్యాధులు వస్తాయని వాపోయారు. కట్టకు మరమ్మత్తులు చేయాలని మళ్లీ ఇటువంటి ఇబ్బందులు రాకుండా శాశ్వత పరిష్కారం దిశగా మరమ్మత్తు పనులు చేపట్టాలన్నారు. మంచినీళ్ల కలుషితం అయ్యి దుర్వాసన వస్తున్నాయి. దానిపై ఇంతవరకు పంచాయతీ అధికారులు ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకొనలేదని, చెరువులో ఉన్న మురుగు నీరు బయటకి పంపించి మంచినీటితో చెరువు నింపి ప్రజలకు ఇబ్బందులు లేకుండా మంచినీరు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి బి.బాబురావు ఉల్లంగుల శివయ్య, కె.సత్యనారాయణ, ఎస్.నీలాంబరం, బి.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి శివాజీ


సాంకేతిక పరికరాలను పరిశీలిస్తున్న జర్మనీ బృందం

వివిఐటి విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన జర్మనీ బృందం

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని నంబూరు వివిఐటి సాంకేతిక విశ్వవిద్యాలయాన్ని జర్మనీలోని అతి పెద్ద నైపుణ్యశిక్షణా సంస్థ డెక్రా ఆకాడమీ ప్రతినిధులు, రాష్ట్ర నైపుణ్య కార్యక్రమాలను మెరుగుపరచడానికి మరియు యువతకు ప్రపంచ ఉపాధి అవకాశాలను సులభతరం చేసేందుకు గాను ఎంపిక కాబడ్డ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు (అంతర్జాతీయ నైపుణ్య మరియు ఉద్యోగ కల్పన) సీతాశర్మాతో కలసి శుక్రవారం సందర్శించారు. వివిఐటి విశ్వవిద్యాలయంలోని సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని సందర్శించారు. బృందానికి విద్యార్థులకు అందించే శిక్షణ గురించి సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ డాక్టర్ రావెల నవీన్ వివరించారు.



సదస్సులో పాల్గొన్న వైద్యులు

ఎన్ఆర్ఐలో వార్షిక సదస్సు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఎన్నారై వైద్య కళాశాలలో అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ చాప్టర్ ఆధ్వర్యంలో 48వ వార్షిక సదస్సును శుక్రవారం ప్రారంభించారు. ఈ సమావేశానికి వివిధ ప్రాంతాల నుండి 1500 మంది వైద్యులు హాజరయ్యారు. ఈ సదస్సులో భాగంగా ముఖ్య విభాగాలలో శిక్షణా తరగతులను నిర్వహించారు. రాష్ట్రంలోనే మొదటి సారిగా మానవ అవయవ మార్పిడి విధానాన్ని ప్రత్యక్ష పద్ధతిలో చేస్తూ వివరించారు. రోబోటిక్ శస్త్ర చికిత్స సంచార వాహనాన్ని వైద్యులకు, వైద్య విద్యార్థులకు అవగాహన కోసం మూడు రోజుల పాటు ఉంచనున్నారు. కార్యక్రమంలో ఎన్నారై అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్, అప్సికాన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ప్రవీణ్ సూర్య వంశీ, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోవర్ధన్ రెడ్డి, ఎన్నారై డీన్ డాక్టర్ లక్ష్మీ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ శివశంకర్, డాక్టర్ సుష్మా, డాక్టర్ అనురూప్, డాక్టర్ మల్లికార్జున రెడ్డి, సర్జరీ వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మంగళగిరి

డిసెంబర్ 31వ తేదీ నుండి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని మంగళగిరి పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ అన్నారు. శుక్రవారం మంగళగిరి పట్టణంలో జరిగిన మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. జనవరి నాలుగో తేదీన జరిగే కార్మిక మహా ర్యాలీలో మంగళగిరి పట్టణం నుండి అన్ని రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ ఆందోళనలలో భాగంగా ఎమ్మెల్యేలు, మంత్రులకు కార్మికుల సంతకాలతో కూడిన అర్జీలు అందజేయడం, సామూహిక రాయబారాలు నిర్వహించడం, నిరసనలు, ర్యాలీలు, రిలే నిరాహార దీక్షలు తదితర దశల వారి గా జరిగే ఆందోళన కార్యక్రమాల లో మున్సిపల్ కార్మికులందరూపాల్గని జయప్రదం చేయాలని బాలాజీ కోరారు. ఈ సమావేశంలో మంగళగిరి పట్టణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ యూనియన్ నాయకులు వై.శివ నాగేశ్వరరావు, అంజనేయులు, ఏసు, సునీత,శీను తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు పట్టణ కార్యదర్శి బాలాజీ


ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావును సన్మానిస్తున్న కమిషనర్, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్, డిఈవో

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - మంగళగిరి

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ టీచర్లగా మంగళగిరి పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీనివాస రావు, రత్నాలు చెరువులో గల హైస్కూల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు మందులా దేవిని, మున్సిపల్ ప్రైమరీ స్కూల్లో పనిచేస్తున్న సెకండ్ గ్రేట్ ఉపాధ్యాయులు కేటగిరీలో సైదా నాయక్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. గుంటూరులో జరిగిన ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకల్లో ఆయనను జిల్లా పరిషత్ చైర్ పర్సన్, గుంటూరు కార్పొరేషన్ కమిషనర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజన్న ప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక సన్మానించారు.

మంత్రి నారా లోకేష్‌కు రజక వృత్తిదారులు అభినందనలు



ప్రజాశక్తి- తాడేపల్లి

స్థానిక 13వ సచివాలయం, 17వ వార్డు రజక ధోబి కానా స్థలంలో చిట్యాల ఐలమ్మ రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజా వినియోగంలో తీసుకురావడానికి అవసరమైన 77 లక్షల నిధులను మంజూరు చేసిన స్థానిక శాసనసభ్యులు, మంత్రి నారా లోకేష్‌కు ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. చిట్యాల ఐలమ్మ రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 2020 జూలై ఒకటో తేదీన అప్పటి ప్రభుత్వం శంకుస్థాపన చేసి కోటీ 20 లక్షల నిధులతో గతంలో నిర్మాణ పనులను ప్రారంభించి ఫౌండేషన్ పిల్లర్లపై స్లాబు మాత్రమే చేపట్టి నిధులు లేనితో పనులు మధ్యలోనే నిలుపుదల చేశారు. శుక్రవారం రూ.77 లక్షల సిఎస్ఆర్ నిధులను మంజూరు చేయించి కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేయుటకు కృషిచేసిన మంత్రివర్యులు నారా లోకేష్ బాబుకు ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీహఅదయపూర్వక ధన్యవాదాలు తెలిపింది.

పనులు పరిశీలించిన టిడిపి నేతలు

శుక్రవారం నిర్మాణ పనులు ప్రారంభించిన తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ పున్న నిర్మాణ పనులను చేపట్టిన కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలతో కూడిన విధంగా నిర్మాణ పనులను అతి త్వరగా పూర్తిచేసి కమ్యూనిటీ హాల్ ప్రజా వినియోగంలోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రజక వఅత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, మంగళగిరి తాడేపల్లి నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఉండవల్లి పార్థసారథి ,పాగోలు శ్రీనివాసరావు ,సంఘ సభ్యులు తాడేపల్లి సాంబశివరావు, ధరణికోట వీరాంజనే యులు, ఉండవల్లి దుర్గారావు, కాజాశ్రీనివాసరావు, కొత్తపల్లి శ్యామ్, కొండ్రాయి గుంట యానాది రావు, రావలసల రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరించిన మంత్రి మనోహర్

ప్రజాశక్తి - తెనాలి


అర్జీదారుడితో మాట్లాడుతున్న మంత్రి

స్థానిక బోసురోడ్డు లోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు లిఖితపూర్వకంగా మంత్రికి అర్జీలు సమర్పించారు. అర్జీదారులతో మంత్రి మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు బదులిచ్చారు.కార్యక్రమంలో మంత్రి ఓఎస్‌డి ఎన్.ఏసురత్నం, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.


లాజర్ బాబును సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టీనా

కాకుమాను లాజర్‌బాబుకు సన్మానం


ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరు నేతాజీ నగర్ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కాకుమాను లాజర్ బాబును గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసరావు, కృష్ణ, గుంటూరు ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, జిల్లా విద్యా శాఖాధికారిణి సి.వి. రేణుక శుక్రవారం ఘనంగా సన్మానించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన ఆయనకు గుంటూరులో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమంలో సన్మానం జరిగింది. అవార్డు అందుకున్న లాజరు బాబును సహధ్యాయులు, ఉపాధ్యాయులు, అధికారులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలియజేశారు. 2025 టెన్త్ పబ్లిక్ పరీక్షలలో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించడం, తన విద్యార్థి రాష్ట్ర గవర్నర్ గారిచే అవార్డు పొందేటట్లు చేయడం, స్కూల్లో సి సి కెమెరాలు ఏర్పాటు చేయడం, వంటి కార్యక్రమాల వలన ఈ జిల్లా స్థాయి అవార్డును లభించిందని అవార్డు గ్రహీత లాజరు బాబు తెలియ జేశారు.

ప్రతి చిన్నపనికీ 7కిలో మీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది..

ప్రజాశక్తి - దుగ్గిరాల

పంచాయతీలో ఏ పని కావాలన్నా రెండు బస్సులు మారి 7 కిలోమీటర్ల దూరం వెళ్ళవలసి వస్తుందని దుగ్గిరాల గ్రామంలోని అలీ నగర్‌లో ఉన్న కొలకలూరు గ్రామ శివారు ప్రజలు వాపోతున్నారు. స్థానిక అలీ నగర్ మసీదు వద్ద శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు పడుతున్న బాధలు తెలియజేశారు. స్థానిక అలీనగర్‌లో తెనాలి మండల రూరల్ గ్రామం కొలకలూరు శివారుకు చెందిన 45 కుటుంబాల వారు గత 150 సంవత్సరాల నుండి నివాసం ఉంటున్నారు. కేవలం 100 మీటర్ల దూరంలో దుగ్గిరాల పంచాయతీ కార్యాలయం ఉండగా పుట్టిన తేదీ మరణించిన తేదీ నమోదు నుండి రేషన్ కార్డు పెన్షన్లు ఇంటి పన్నులు ఓట్లు తదితర అన్ని పనుల కోసం కొలకలూరు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వఅద్ధులు మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు. క్రొత్త రేషన్ కార్డులు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న కాజీపేటకు వచ్చాయని వాపోతున్నారు. గతంలో అనేకసార్లు తమను దుగ్గిరాల పంచాయతీలో కలపాలని అధికారులకు ప్రజా ప్రతినిధులకు అర్జీలు ఇచ్చారు. అనుమతుల వచ్చినా ప్రభుత్వం మారిన తర్వాత అది బుట్ట దాఖలైందని తెలిపారు. మంత్రి లోకేష్ చొరవచూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ మహబూబ్ సుభాని మహమ్మద్ సాదిక్ పఠాన్ చందు ఖాన్ ఖురేషి ఉస్మాన్ లియాఖత్ ఖాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.


వివరాలు తెలుపుతున్న అలీనగర్ వాసులు

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - కొల్లిపర

కొల్లిపరలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం ప్రారంభించారు . కొల్లిపరలో అత్యధికంగా 19 వేల స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కొత్త కార్డులు పొందినవారు కూడా ఈ నెల రేషన్ తీసుకోవచ్చని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మీ, తహాశీల్దార్ సిద్ధార్థ, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు వీరమహిళలు పాల్గొన్నారు.



యూరియా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

రైతులకు యూరియా పంపిణీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం జొన్నలగడ్డ గ్రామంలో ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రం వద్ద శుక్రవారం రైతులకు యూరియా, డిఏపి కాంప్లెక్స్ ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు ఎరువులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ఎరువుల కోసం రైతులు ఒక్కసారిగా ముందుకు రావడంతో కొంత హడావుడి వాతావరణం నెలకొందని తెలిపారు. ఎరువుల నిల్వలకు సంబంధించి వైసిపి చేస్తున్న అసత్య ప్రచారాలు తిప్పి కొట్టాలన్నారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమన్నారు.



ముగింపు కార్యక్రమంలో కేక్ కట్ చేస్తున్న మదార్‌సాహెబ్

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్ అన్నారు. మాచర్ల పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టుమిషన్ ట్రైనింగ్ క్యాంపు శుక్రవారంతో ముగిసింది. ముఖ్య అతిథులుగా మాచర్ల పట్టణ మున్సిపల్ చైర్మన్ షేక్‌మదార్ సాహెబ్, మున్సిపల్ మాజీ చైర్మన్ కూనిశెట్టి వెంకటేశ్వర్లు హాజరై ప్రసంగించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. పోకూరి కాశీపతి, ఓర్సు క్రాంతికుమార్. ప్రోగ్రాం ఇన్చార్జి లక్ష్మీప్రభావతి, ట్రయినర్ బి.లక్ష్మీ, సిఓజ్యోతి పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న కేశవరెడ్డి

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పట్టణంలోని 31వార్డు వినాయకుని గుట్ట ప్రాంతానికి టీడీపీ కార్యకర్త కర్ర అబ్రహాం(28) గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ నాయకుడు యెనుమల కేశవరెడ్డి కర్ర అబ్రహాంకు నివాళులు అర్పించి, కుటుంబాన్ని ఓదార్చారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలును ఆర్థిక సాయంగా కుటుంబ సభ్యులకు అందించారు. అబ్రహాం కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని కేశరెడ్డి తెలిపారు.

పలువురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



జ్ఞాపికలు అందుకున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - యడ్లపాడు

ప్రత్యేక థీమ్ లేనప్పటికీ ప్రతి సంవత్సరం సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజున ఉపాధ్యాయుల సేవలను గుర్తించడం, వారిని గౌరవించడం ప్రధాన ఉద్దేశం. గురు అంటే: అంధకారాన్ని తొలగించేవారు అజ్ఞానం నుంచి జ్ఞాన సంపదను ఇచ్చేవారు. సెప్టెంబర్ 5వ తేదీన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజును దేశంలో ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపు కుంటారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయులు అత్యంత విలువైన ఆలోచనలు గలవారని భావించారు. మొదట 1962వ సంవత్సరం నుండి సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవంగా పరిగణిస్తున్నారు. రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడుగా, ప్రొఫెసర్‌గా అనేక పదవులు చేపట్టారు. ఉపరాష్ట్రపతిగా, రెండవ భారత రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ తిరుత్తనిలో 1888, సెప్టెంబర్ 5వ తేదీన జన్మించినారు. ఆయన తల్లిదండ్రులు సర్వేపల్లి వీరాస్వామి, సీతమ్మ. రాధాకష్ణన్ మద్రాసులో క్రిస్టియన్ కళాశాలలో విద్యను అభ్యసించారు ఆయన 1907లో అక్కడ నుండి పట్టభద్రులయ్యారు అదే కళాశాల నుండి తన మాస్టర్ డిగ్రీని కూడా పూర్తి చేశారు. రాధాకృష్ణన్ 1975, ఏప్రిల్ 17వ తేదీన మరణించారు. తిమ్మాపురంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని నరేంద్ర సువర్ణకుమారి ఫౌండేషన్ వారు నిర్వహించారు. ఉపాధ్యాయులకు అభినందన పురస్కార జ్ఞాపికలు అంద జేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్వాడీలు, గ్రామ పెద్దలు పావులూరి రాధా, నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ అధ్యక్షురాలు సువర్ణ కుమారి, ఉప అధ్యక్షుడు ఎందేటి ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - మాచర్ల

విద్య అనేది సమాజానికి దారి చూపే దీపం వంటిదని, అంధకారాన్ని తొలగించి, ప్రకాశవంతమైన భవిష్యత్తును నిర్మించడానికి సహాయపడుతుందని మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్ అన్నారు. పట్టణంలోని శ్రీకాసుబ్రహ్మానంద రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డేను నిర్వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్ మాట్లాడుతూ విద్యార్థి దశలో ఇంటర్ చదువు ముఖ్యమైనదని, ఈ సమయంలోనే విద్యార్థి తన భవిష్యత్తును తీర్చిదిద్దు కోవాలన్నారు. విద్య ద్వారా జ్ఞానాన్ని సంపాదించి, జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకుని, సమాజంలో మంచి మార్పు తీసుకురావాలని సూచించారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా అధ్యాపకులను సన్మానించారు. ఆవుల వీరాం జనేయులు, మెట్టు గోవిందరెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని కృష్ణవేణి కళాశాల వారు స్థానిక నరసరావుపేట రోడ్డులోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ముందుగా గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు కళాశాల అధ్యాపకులను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి నూతన వస్త్రాలను బహూకరించారు. కళాశాల కరస్పాండెంట్ బి.లింగారావు, మల్లికార్జునరావు, ప్రిన్సిపల్ ఆంజనేయులు అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమంల్లో కృష్ణవేణి కళాశాల విద్యార్థులు

రైతులపైనా రాజకీయ ముద్ర తగదు

జిల్లా వైసిపి కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైతులపైనా రాజకీయ ముద్ర వేసి వైసిపి వర్గీయులన్న నెపంతో ఎరువులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం తగదని, కూటమి నేతల కనుసన్నల్లో ఎరువులు అక్రమ రవాణా జరుగుతోందని వైసిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ రైతాంగాన్ని కూటమి ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందని, రైతుల పక్షాన ఈ రాష్ట్రంలో పోరాటం చేసేందుకు వైసిపి ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. గ్రామస్థాయిలో టీడీపీ నాయకులు సంతకం పెడితేనే రైతుకు యూరియా ఇచ్చే పరిస్థితి కొనసాగుతోందన్నారు. కలెక్టర్, అగ్రికల్చర్ అధికారులు యూరియా సరిపడా ఉందని చెబుతున్నా రెండు, మూడు కట్టలేఇస్తున్నారనితెలిపారు. రూ266 అమ్మాల్సిన యూరియా రూ400కు అమ్ముతున్నారన్నారు. ధరల స్థిరీ కరణ నిధిని ఏర్పాటు చేసి రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించాల న్నారు. ఈనెల 9న రైతాంగ సమస్యలపై వైసిపి ఆధ్వర్యంలో అన్ని రైతు, ప్రజా సంఘాల నాయకులను కలుపుకుని జిల్లా వ్యాప్తంగా మూడు రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల పరిధిలో ర్యాలీ నిర్వహించి ఆర్డీఓలకు వినతి పత్రం అందజేస్తామన్నారు. రొంపిచర్ల, నకరికల్లు, శావల్యాపురం, ఈపూరు మండలాల రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉన్న నరసరావుపేట విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని చిలకలూరిపేటకు తరలిస్తే రైతులు, ప్రజ లు ఇబ్బందులు పడతారన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ స్పందించి విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం తరలింపు నిలిపి వేయాలన్నారు. రైతు విభాగం నాయకులు అన్నెం పున్నారెడ్డి, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రూ.లక్ష పలికిన మత్స్యకారుల యువసేన గణేష్ లడ్డు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

స్థానిక డౌన్ మార్కెట్‌లోని మత్స్యకారుల యువ సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ లడ్డును ఓసుపల్లి అంజి రూ.లక్షకు దక్కించుకున్నారు.శుక్రవారం గణేష్ విగ్రహం వద్ద కమిటీ ఆధ్వర్యంలో వేలం పాటను నిర్వహించారు. యలక కాయను సౌరడా అశోక్ రూ. 57వేలకు, రూ. 200ల నోట్ల దండను యజ్జల తాతీలు 45వేలకు, రూ. 100ల దండను యజ్జలరంగ 30వేలకు, రూ. 50 లదండను మైలపల్లి అప్పారావు 33వేలకు, రూ. 10ల దండను బంగారు చిట్టి 23వేలకు కలశాన్ని చెల్లూరి రాజు రూ. 36వేలకు, స్వామి వారి హుండీని మైలపల్లి నారాయణ రూ. 30వేలకు దక్కించు కున్నారు. వినాయక విగ్రహం వద్ద వేలం పాట ద్వారా కమిటీకి రూ. 3లక్షల, 54వేల ఆదాయం సమకూరింది. డౌన్ మార్కెట్‌లోని ఆంజనేయస్వామి గుడి భజరంగదళ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ లడ్డును మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు మైలపల్లి అప్పలరాజు రూ. 35వేలకు దక్కిం చుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు ఆయా విగ్రహా లను గ్రామ పురవీధుల్లో అంగ రంగ వైభవంగా ఊరేగింపు జరిపి సాగర్ కుడి కాలువలో నిమజ్జనం చేశారు.

దేశానికే ఆదర్శం ఏపీ క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ : జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకుని వస్తున్న యూనివర్సల్ హెల్త్ పాలసీ పేదల పాలిట సంజీవని కానుందని తెలిపారు చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. డబ్బులేక చికిత్స చేయించు కోలేని ఏ ఒక్కరు ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితులు ఇకపై ఉండవి, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశ పెడుతున్న క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ దేశానికే ఆదర్శంగా అవుతుందని అన్నారు. సుమారు 1.63కోట్ల కుటుంబాలు, 5 కోట్లమంది ప్రజలకు ప్రయోజనం అందించనున్న అందరికీ ఆరోగ్య బీమా 100 శాతం గేమ్ ఛేంజర్ అవుతుందన్నారు. రూ.25 లక్షల వరకు పరిమితి ఉండడం వల్ల ఇకపై ఖరీదైన వైద్య సేవలకు ఎవరూ భయపడాల్సిన పరిస్థితి ఉండదన్నారు. రాష్ట్రం మొత్తం దాదాపు 2,493 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 3,257 పైగా వైద్య సేవలు రూపాయి ఖర్చు పెట్టకుండానే అందుతా యన్నారు. ఆస్పత్రుల్లో చేరిన 6 గంటల్లోనే క్యాష్‌లెస్‌కు అనుమతులు ఇవ్వడంతో జాప్యం లేకుండా సేవలు అందుబాటులోకి రానున్నాయని అన్నారు.



మదర్ థెరీసాకు నివాళి అర్పిస్తున్న సమితి సభ్యులు

మదర్ థెరీసాకు నివాళి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మదర్ థెరీసా 28వ వర్ధంతిని పురస్కరించుకొని మదర్ థెరిసా సేవ సమితి ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలో థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమితి అధ్యక్షులు గాదె కిరీటిరెడ్డి మాట్లాడుతూ మదర్ థెరిసా అనేకమంది కుష్టు రోగులు, వికలాంగులు, వృద్ధులకు సేవ చేయడమే కాకుండా ఉపాధ్యాయురాలుగా అందరికీ పాఠాలు బోధించి చిరస్మరణీయులైనారని కొనియాడారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు అడ్వకేట్ చిలమకూరి నాగిరెడ్డి, అందుగుల బాలజోజి, కుర్రి సాయి మార్కొండారెడ్డి, కసిరెడ్డి శాంతిరెడ్డి, అందుగుల చంద్రయ్య, ముత్యాల పాపిరెడ్డి, కొణతం ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

పాస్టర్లు, క్రైస్తవుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించండి

ప్రజాశక్తి - వినుకొండ

చర్చిల పాస్టర్లు, క్రైస్తవుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని కోరుతూ పలు క్రైస్తవ సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్న క్రైస్తవనాయకులు డాక్టర్ గోళ్ళమూడి రాజాసుందర్ బాబు మాట్లాడుతూ భారతదేశంలో శాంతికాముకులైన క్రైస్తవులు, చర్చిలపై దాడులు జరుగుతున్నాయని వీటిని నిరోధించేందుకు ప్రభుత్వం ఒక ప్రత్యేక క్రైస్తవ నిరోధక చట్టాన్ని రూపొందించాలని డాక్టర్ గోళ్ళమూడి విజ్ఞప్తి చేశారు. బాప్టిస్ట్ చర్చ్ సంఘ కాపరి రెవ.డాక్టర్ జె స్పర్జన్, అధ్యక్షులు చాట్ల రామయ్య, కార్యదర్శి ఆర్‌సి వరప్రసాద్, వందనం మాట్లాడుతూ వివిధ చర్చిల పాస్టర్లు తలపెట్టిన చలో వినుకొండ కార్యక్రమానికి తమ పూర్తి మద్దతు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈనెల 16వ తారీఖున ఉదయం 10 గంటలకు, వెల్లటూరు రోడ్డులోని జిప్సీ ప్రార్థన మందిరం నుండి భారీ ర్యాలీగా చర్చిల పాస్టర్లు, క్రైస్తవ విశ్వాసులు తహల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం తహశీల్దారుకు వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ చర్చిల సంఘ నాయకులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను కొనసాగించాలి



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు బి.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ఆప్కాస్ లో పనిచేస్తున్న 25 మంది పారిశుధ్య కార్మికులను చెప్పా పెట్టకుండా తొలగించడం దారుణమని సిఐటియు నాయకులు బి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరి సిఐటియు కార్యాలయంలో మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ మున్సిపల్ కార్మికుల విస్తృత సమావేశం వి వెంగమ్మ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారులు 60 సంవత్సరాలు నిండినవి అని చెప్పి 25 మందిని కార్మికులను తొలగించడం అన్యాయమని అన్నారు. వెంటనే అధికారులు వారిని పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 65 సంవత్సరాల వరకు వారికి ఉందని అన్నారు. అదేవిధంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని అన్నారు. రిటైర్మెంట్ అయిన వారి స్థానంలో వారి పిల్లలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రెండు సంవత్సరాల నుండి చెప్పులు, సబ్బులు, పారలు, నూనెలు పారిశుద్ధ కార్మికులకు ఇవ్వడం లేదని వారికి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధఅతం చేస్తామని చెంగయ్య హెచ్చరించారు. అదేవిధంగా విశాఖపట్నంలో జరిగే సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ, తాడేపల్లి రూరల్ నాయకులు పి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

276వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి 276 రోజులకు చేరుకున్నాయి. దీక్షలను సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కె.స్టీవెన్, ఎం.గురవయ్య, తుపాకుల నాగేశ్వరావు, బి.అంకయ్య, సూర్యప్రకాష్ ప్రారంభించారు. దీక్షలలో షైక్ ఇమాంభి, అల్లం విజయశ్రీ, వేము రిబ్కా, బళ్లా శివమ్మ, మొలక శారదాలు కూర్చు న్నారు. కార్యక్రమంలో వై.సాంబశివ రావు, ఎం.ఆశీర్వాదం, వై.సుబ్బారావు, రమాదేవి, శారమ్మ, డి.బేబమ్మ, ఎం.శివకుమారి, దుర్గాభవాని, కాసమ్మ, హగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ విధిస్తున్న సుంకాలను వ్యతిరేకిస్తూ నేడు నిరసన ర్యాలీ

ప్రజాశక్తి- తాడేపల్లి

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారతదేశంపై విధిస్తున్న సుంకాలను నిరసిస్తూ శనివారం సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్టు నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, తుడిమెళ్ళ వెంకటయ్య తెలిపారు. శుక్రవారం తాడేపల్లి మేక అమరారెడ్డి భవన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ కార్యకర్త లతో పాటు ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు డి.వి.భాస్కర్ రెడ్డి, వై.బర్నబాస్, డి.విజయబాబు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ఘనంగా టీచర్స్ డే

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని పలు గ్రామాలలో శుక్రవారం ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. నంబూరు యానాది కాలనీలో స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండలరావు ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కెమిస్ట్రీ ప్రొఫెసర్ రామచంద్రన్ ఆర్థిక సహకారంతో కాలనీలోని పిల్లలకు అల్పాహారం పెద్దలు అందరికీ దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కొండల్ రావుతో పాటు,ఈమని ప్రతాపరెడ్డి, తులాబందుల తాతయ్య, వల్లభాపురపు రాజ్ కుమార్, పాస్టర్ అబ్రహం, నాగేంద్ర నాయక్ పాల్గొన్నారు. స్థానిక గ్రంథాలయాధికారి నంద్యాల నాగిరెడ్డి ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు కొల్లిపర ఆనందరావు, లింగంగుంట్ల రవిబాబు, కిషోర్, సంగీతరావు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞానం అందించేది గురువులే

ప్రజాశక్తి - దుగ్గిరాల

మానవాళికి విజ్ఞానం అందించేది గురువులేనని గురువులను గౌరవించడ ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత అని స్థానిక సర్పంచ్ బాణావతి ఖుషి బాయి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు వల్లూరు నరసింహారావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ షేక్ జబీన్ యాడ్ చైర్మన్ ఉన్న%శీ% ఝూన్సీ టిడిపి మండల అధ్యక్షులు కేశంనేని శ్రీ అనిత కేశంనేని వాసు పర్వతనేని హర్ష బాలు యాదవ్, బాణావతి వెంకటేశ్వర నాయక్ కొంగర జోగేంద్ర పాల్గొన్నారు.

కుల గణన పూర్తి చేసి స్థానిక ఎన్నికలకు వెళ్లాలి..

బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు



రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షులుగా పారేపల్లి మహేష్ నియమిస్తూ పత్రాన్ని అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రభుత్వం కుల గణన చేపట్టి, పూర్తి చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేతన శంకరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మంగళగిరిలోనే బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్‌ను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా నియమిస్తూ, నియామక పత్రాన్ని అందజేశారు. శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. మహిళలకు రక్షణ చట్టం కల్పిస్తామన్నారని తెలిపారు. ప్రభుత్వం కుల గణన ప్రక్రియను పూర్తి చేసి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందు కోసం ఈ నెల 9వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలను ఏర్పాటు చేసి కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించడం జరుగుతుం దన్నారు. గుంటూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా పని చేసిన పారేపల్లి మహేష్ కు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్ష పదవిని కేటాయించినట్లు చెప్పారు.

ఎన్నికలకు ముందు జయహో బిసి అంటారు ఎన్నికల తర్వాత మా మొహం కూడా చూడరు : పారేపల్లి మహేష్

ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు జయహో బీసీ అంటూ బీసీలను దేవుడిలా కొలుస్తారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు పారేపల్లి మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం నాయకులు కాగితాల స్వాతి గౌడ్, తిరువీధుల కిరణ్, ఆలా శివాజీ యాదవ్, మంద్రు సత్యనారాయణ, జంజనం వరప్రసాద్, కాట్రు ధనుంజయ్, ఇసునూరి నగేష్, గొడ్డెల గల జయలక్ష్మి, కొమ్మాకుల విజయభాస్కర్, నల్లబోతు సుబ్బారావు,

130 మంది విద్యార్థినులకు రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి సైకిళ్లు పంపిణీ

ప్రజాశక్తి- తాడేపల్లి

రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్, తాడేపల్లి ఆధ్వర్యంలో శుక్రవారం ఉండవల్లిలోని దేవుడు మనల్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థిని లకు ఉచితంగా సైకిల్ పంపిణీ చేశారు. తాడేపల్లి పట్టణ రూరల్ గ్రామాలకు చెందిన పలు ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 130 మంది బాలికలకు తాడేపల్లి అధ్యక్షులు శెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో అందజేశారు. ముఖ్యఅతిథిగా డిస్టిక్ గవర్నర్ (3150) డాక్టర్ ఎస్ వి రామ్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ ఈదర పూర్ణ చంద్రరావు, బిజిఆర్ మైనింగ్ లిమిటెడ్ డైరెక్టర్ విసిరెడ్డి బాల కోటిరెడ్డి,పిడిజి లు తాళ్ల రాజ శేఖర్ రెడ్డి, రవి వడ్లమాని,రోటరీ క్లబ్ అఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షులు పంగలూరి కళ్యాణ్,సెక్రటరీ విసిరెడ్డి లక్ష్మి, సర్వీస్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ చక్రవర్తి



సైకిళ్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

రెడ్డి,రోటరీ క్లబ్ అఫ్ మంగళగిరి అధ్యక్షులు ప్రగడ రాజ శేఖర్, రోటరీ క్లబ్ అఫ్ తాడేపల్లి కార్యదర్శి జెట్టి శ్రావణి, కోశాధికారి కావూరి వెంకట నగేష్,ప్రాజెక్ట్ చైర్మన్ మున్నంగి వివేకానంద రెడ్డి, పాస్ట్ ప్రెసిడెంట్ రావూరి రమేష్ బాబు,సుకుమార్ రెడ్డి, గోపు నాగ రాజేష్, కాట్రాగడ్డ శివన్నారాయ, జొన్న రాజేష్, చంద్ర ఓబులా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో మసీదు నిర్మాణానికి 100 ఎకరాల కేటాయించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర రాజధాని అమరావతిలో జుమ్మ మసీద్ నిర్మాణానికి 100 ఎకరాల భూమిని కేటాయించాలని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జలీల్ మంగళగిరిలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ విజయవాడ నగరంలో గాలిబ్ షాహిద్ దర్గా భూములు సర్వే నెంబర్ 600, 63, 10 లలో ఖాళీగా ఉన్న భూములను నీరుపేద ముస్లింలకు ఇల్లు కట్టుకోవటం కోసం ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని, విద్య , ఉద్యోగ రంగాలలో ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ముస్లిం అభివఅద్ధి కొరకు రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వ ఇస్తున్నాము ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ముస్లిం సంఘాలు, జేఏసీ అధికారులు అందరూ హాజరు కావాలని షేక్ జలీల్ విజ్ఞప్తి చేశారు .

అరుణ శ్రీకి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కు ఎంటిఎంసి పరిధిలోని చిర్రావూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని ఈ పూరి అరుణశ్రీ ఎంపికయ్యారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఈ అవార్డును అరుణశ్రీ అందుకున్నారు. ఆమెకు అవార్డు రావడం పట్ల చిర్రావూరు గ్రామంలోని పలువురు పెద్దలు తమ గ్రామ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ శ్రీ కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చిర్రావూరు జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయిని ఈ పూరి అరుణశ్రీ తమకు శుభాకాంక్షలు తెలిపిన తోటి ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయు లకు, అధికారులకు, గ్రామ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.



30 మంది ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హై స్కూల్ నందు లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మహానగర్ ఆధ్వర్యంలో నిర్వాహకులు జిల్లా పరిషత్ హై స్కూల్ లోని 30 మంది ఉపాధ్యాయిని ఉపాధ్యాయులను శాలువాలు కప్పి, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప, ఉపాధ్యాయులు చావా శ్రీనివాసరావు, రామచంద్రారెడ్డి, సుబ్బలక్ష్మి, తోట శ్రీనివాసరావు, దాసరి శ్రీనివాసరావు, సాయి రాంబాబు, పులి కోటేశ్వరరావు, ముత్యాల అరుణ, రాజేశ్వరి బాయ్, పి విజయ్ కుమారి, కొల్లి ఉమాదేవి, శరత్ చంద్ర, టి.నాగేశ్వరరావు తదితరులను లైన్స్ క్లబ్ ఆఫ్ మహానగర్ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే

ప్రజాశక్తి - తెనాలి

విద్యార్థులను సమాజంలో విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని లైన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ అధ్యక్షులు ఎన్.కృష్ణమోహన్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం క్లబ్ సభ్యులు డాక్టర్ పల్లవి సహకారంతో మారిసు పేట ఎన్సీఆర్ ఎం హైస్కూల్ ఉపాధ్యాయిని ఆర్ సంపూర్ణను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కె.సుబ్రమణ్యం, ఎస్.రాంప్రసాద్, కె.చిన్నికృష్ణారెడ్డి, పి.వెంకటేశ్వరరావు, డాక్టర్ ఎ.మల్లేశ్వరరావు, కె.రమేష్ కృష్ణ పాల్గొన్నారు..

జాషువా విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో...

పట్టణానికి చెందిన గుర్రం జాషువా విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. . కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత, సమితి అధ్యక్షులు పినపాటి రవికుమార్, న్యాయవాది ఇందుపల్లి రాజారాం, షేక్ అమీర్ జానీ, కె.రమేష్ పాల్గొన్నారు.




జేఎంజె కళాశాలలో.

స్థానిక జె.ఎం.జె. మహిళా కళాశాలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినిలు అధ్యాపకుల పాత్ర పోషించి సందడి చేశారు. కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గాదె థెరీసమ్మ మాట్లాడారు. అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది థెరీసమ్మను సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శాంత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్. సిస్టర్ రోజలిన్ ఉపాధ్యాయ దినోత్సవంపై వివరించారు. టీచర్స్ డే సందర్భంగా అధ్యాపకులు వివిధ క్రీడల్లో పాల్గొని గెలిచిన వారికి బహుమతులు అందించారు. విద్యార్థినిలు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జనతా వెల్ఫేర్ టీం ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాడేపల్లి



సరుకులు అందజేస్తున్న సభ్యులు

స్థానిక నులకపేట జనతా వెల్ఫేర్ టీం ఆధ్వర్యంలో శుక్రవారం షేక్ ఇబ్రహీం సలీమా, మరియు మల్లాది వెంకట్రామ శర్మ, లక్ష్మిల కుటుంబాలకు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందించారు. ఈ రెండు కుటుంబాల భార్య భర్త, పెరాలసిస్‌తో అనారోగ్య సమస్యలు వచ్చి ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉండడంతో సమస్య వెల్ఫేర్ టీం దృష్టికి వెళ్ళింది. స్పందించిన టీం సభ్యులు ఎం.టి.ఎం.సి కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు చేతుల మీదుగా రైస్ బ్యాగ్స్, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు.



సన్మానం పొందిన ప్రముఖులు

సమాజాభివృద్ధికి ఉపాధ్యాయులే మార్గదర్శకులు

ప్రజాశక్తి - గుంటూరు

వివిధ రంగాల్లో ఉన్న పనిచేస్తున్న వారు నేడు సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, అందుకు ఉపాధ్యాయుల కృషే కారణమని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. స్థానిక విద్యానగర్‌లోని ఆదిత్రి ఎగ్జోటికా అపార్ట్మెంట్స్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాల భాగంగా నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. సభకు హిందూ కళాశాల విశ్రాంత అధ్యక్షులు డాక్టర్ అంబరాజు రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని ఒక పవిత్రమైన, ఉన్నతమైనదిగా భావించి పనిచేస్తున్న ఉపాధ్యాయులు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో నిరంతరం కృషి చేస్తున్న డాక్టర్ రాజశేఖర్, కృష్ణవేణి, టి.రమాదేవి, ఎన్.వి.సుశీల, పి.జెసుడియాన్‌బాబు, దీపక్‌పంత్, రమణి, సరళ, డాక్టర్ అరుణ్‌కుమార్, పి.పూర్ణ చంద్రరావు, అరుణ, ఎం.సుబ్రహ్మణ్యం, ఎం. శివకుమారిని సన్మానించారు. కార్యక్రమంలో గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు మానం శ్రీనివాసరావు, ఎం.సుధాకర్, ఆర్.కోటేశ్వరరావు, ఎం.అశోక్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు, వివిధ సంఘాల నాయకులు

పాలస్తీనాకు అండగా నిలవండి

ప్రజాశక్తి - గుంటూరు

పాలస్తీనాకు అండగా నిలవాలని ప్రోగ్రెసివ్ ఫోరం ఆధ్వర్యంలో గుంటూరులో సంఘీభావ శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఏ.చిష్టీ మాట్లాడుతూ గత 22 నెలలుగా అమెరికన్ సామ్రాజ్యవాదం అండతో ఇజ్రాయిల్ పాలస్తీనా, గాజా మీద చేస్తున్న దాడులకు సుమారు 70వేల మంది పిల్లలు మహిళలతో సహా చనిపోవడం, లక్షలమంది క్షతగాత్రులు అయ్యారన్నారు. అంతర్జాతీయ సమాజం ఖండించినప్పటికీ ఐక్యరాజ్యసమితిలో పలు దఫాల తీర్మానాలు చేసినప్పటికీ ఖతర్ చేయకుండా ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమానికి ముక్తి కభీ అధ్యక్షత వహించగా ముక్తి అబ్దుల్ బాసిత్, ముక్తి ఆసిఫ్, సిఐటియు నాయకులు ముత్యాలరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు యశ్వంత్, ఆవాజ్ నాయకులు ఎండి సలీం. మహబూబ్ సుభాని, ప్రజా సంఘాల నాయకులు, లౌకికవాదులు పాల్గొన్నారు.

అనంతపురం ఎమ్మెల్యేను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-మేడికొండూరు

రైతుల సమస్యలపై నిరంతరం ఉద్యమించే రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డిని కించపరుస్తూ అనంతపురం ఎమ్మెల్యే జయరాం మాట్లాడ్డంపై కూటమి ప్రభుత్వం తలదించుకోవాలని కౌలురైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.శివరామకృష్ణ, నాగమల్లేశ్వరరావు అన్నారు. ఇండోసెల్ సోలార్ కంపెనీకి భూములు తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించగా, దానికి వ్యతిరేకంగా కరేడు భూముల రైతులు పక్షాన నిలబడి మాట్లాడినందుకు ఎమ్మెల్యే అక్కసు వెళ్లగగ్గారని విమర్శించారు. చంద్రబాబుకు రైతులపక్షమే అయితే ఎమ్మెల్యేని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవాలు



చలపతి ఫార్మసీలో..

ప్రజాశక్తి - గుంటూరు

లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ మద్దినేని సుధాకర్‌కు, మొహాలీ నైపర్ విశ్రాంత డైరెక్టర్ ప్రొఫెసర్ కె.రఘురాంకు, తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆర్.నాగరాజుకు చలపతి ఫార్మసీ కళాశాల విశిష్ట ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేశారు. వేడుకలకు చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, సెక్రటరీ వై.సుజిత్‌కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సుమేధ హైస్కూల్‌లో..

స్థానిక ఎన్‌జిజిఓ కాలనీలోని సుమేధ హైస్కూల్లో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుని పాత్ర ఎంతో ముఖ్యమైదని చెప్పారు. ఉపాధ్యాయుడు సమాజానికి అద్దంలాంటి వారని, విద్యార్థులకు గురువులు ఆదర్శంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ కె. రాంబాబు, ఉపాధ్యాయ బృందం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు.



కాటూరి పబ్లిక్ స్కూల్‌లో..

గుంటూరు రూరల్, లాల్‌పురంలోని కాటూరి పబ్లిక్ స్కూల్లో శుక్రవారం టీచర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గుంటూరు సౌత్ డివిజన్ డి.ఎస్పీ జి.బానోదయ హాజరై ప్రసంగించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడుగానే కాకుండా దేశ రాష్ట్రపతిగా, ఉపరాష్ట్రపతిగా ఎన్నో సేవలు అందించాం న్నారు. రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యే బోధన చేయాలని సూచించారు. స్కూల్ డైరెక్టర్ కాటూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రసంగించారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జైన్ హైస్కూల్లో..

జైన్ హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ మహమ్మద్ మున్నును పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి లేకుండా సమాజం ముందుకు సాగదని చెప్పారు. కార్యక్రమంలో పి.కనకదుర్గ ప్రసంగించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



సెయింట్ ఆన్స్‌లో..

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కాలేజిలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ డాక్టర్ సంధ్య.టి, అధ్యాపకులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.షారూన్‌రోజ్ అధ్యాపకులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.



ప్రొఫెసర్ ఎంవిఎస్‌కె స్కూల్లో

స్థానిక 41 డివిజన్, పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లోని ప్రొఫెసర్ ఎంవిఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ హెచ్‌ఎం ఎన్.తాండవకృష్ణ ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకఅష్ణ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరినీ ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ శంకర్ పిచ్చయ్య అన్ని తరగతులలోని ఉత్తమ విద్యార్థులకు పారితోషకం ప్రకటించారు. కార్యక్రమంలో స్కూల్ వైస్ ప్రిన్సిపల్ కె.డి.యం.దివ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సిబార్ దంత వైద్య కళాశాలలో..

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రామంలోని సిబార్ దంత వైద్య కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్ గురువులు, జువాలజీ అధ్యాపకులు, శారద ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ అడ్వైజర్ ఈఎస్ఆర్కే ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమణారెడ్డి గురువులు, మద్రాసు నందలి రాగాస్ డెంటల్ కాలేజి ఓరల్ పెథాలజీ విభాగపు హెచ్.ఓ.డి, డాక్టర్ రంగనాథన్ కన్నన్ విచ్చేశారు. ప్రసాద్, డాక్టర్ రంగనాథన్ కన్నన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపక డైరెక్టర్ ఎల్.సుబ్బారావు, డైరెక్టర్ టి. కృష్ణమోహన్, వైస్ డీన్ డాక్టర్ మన్నే ప్రకాష్, డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ డాక్టర్ పి. రేవతి, మరియు కళాశాలలోని అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను సిబార్ దంత వైద్య కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. టీచర్స్ డే సందర్భంగా సిబార్ దంత వైద్య కళాశాల యాజమాన్యం వారు కళాశాలలో విశిష్ట సేవలు అందించిన మరియు దేశంలోని స్పెషాలిటీ అసోసియేషన్స్ లోని పాలకమండలిలో విశిష్ట స్థానం పొందిన అధ్యాపకులను ప్రశంసా పత్రాలతో సన్మానించారు.



తెనాలి మున్సిపల్ బాలుర హైస్కూల్లో..

ప్రజాశక్తి - తెనాలి

ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు స్థానిక కొత్తపేటలోని శ్రీ రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.భారతిని ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. అలాగే త్వరలో పదవీ విరమణ చేయనున్న స్కూల్ అసిస్టెంట్ ఎం.స్వరూపరాణి, చిత్రలేఖనం ఉపాధ్యా యులు టి.ఆర్.ప్రకాష్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎన్.ఇందుశేఖర్, ఎల్లయ్య, కె.ఎస్.ప్రసాద్, ప్రసూనాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.



మంగళగిరి ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో..

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని సమతా హాస్పిటల్ సమీపములగల ఆక్సర్డ్ స్కూల్లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆర్ ఐ అమీనా బేగం, స్కూల్ ప్రిన్సిపల్ చైతన్య, స్కూల్ చైర్మన్ ఫ్రాన్సిస్ రెడ్డి, డైరెక్టర్స్ జోసఫ్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి పాల్గొగని ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

దేశ భవిష్యత్ యువతపై ఆధారపడి ఉంది

ప్రజాశక్తి - గుంటూరు

దేశ ఉజ్వల భవిష్యత్ యువత భుజస్కంధాలపై ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని భాష్యం మెడెక్స్ ఆధ్వర్యంలో స్థానిక ఏటుకూరు రోడ్డులోని వివాహ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గన్నారు. సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ విద్యావ్యవస్థలో సంస్కరణల ద్వారా వచ్చే పెను మార్పులను ప్రతి విద్యార్థి ఆకళింపు చేసుకుంటూ వికసిత్ భారత్ నిర్మాణానికి కఅషి చేయాలన్నారు. నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క విద్యార్థి అందిపుచ్చుకుని ఉత్తమైన వైద్యులుగా రాణించాలని ఆకాంక్షించారు. ఆస్టర్ రమేష్ హాస్పటల్స్ అధినేత, కార్డియోలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు మాట్లాడుతూ మనం నేర్చుకున్న జ్ఞానం, నైపుణ్యాలను సరైన మార్గంలో నడింపిచేవారే గురువు అని అన్నారు. నేడు వైద్యరంగంలో కఅత్రిమ మేధ ద్వారా సంభవిస్తున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని నేటి యువత అందిపుచ్చుకుని అవగాహన చేసుకుని నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. జిజిహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ అంకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నల్లబోతు మురళి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని అన్నారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ జీవితంలో ఎంతో సాధించిన వారిని ప్రేరణగా తీసుకొని ముందుకు



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

సాగాలన్నారు. సభకు భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు అధ్యక్షత వహించారు.అనంతరం విద్యార్థుల చేతుల మీదుగా ఆధ్యాపకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాష్యం వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్‌రామ్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని అన్ని భాష్యం క్యాంపస్‌లలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు.